8. నిశ్చయంగా, అది వారి మీద క్రమ్ముకొంటుంది;[1]

إِنَّهَا عَلَيْهِم مُّؤْصَدَةٌ ﴿٨﴾

9. పొడుగాటి (అగ్ని) స్తంభాలవలె!

فِي عَمَدٍ مُّمَدَّدَةٍ ﴿٩﴾

## 105. సూరహ్ అల్-ఫీల్

سُورَةُ الفِيلِ

అల్-ఫీల్: The Elephant, ఏనుగు, దీనిపేరు **మొదటి ఆయత్** నుండి తీసుకోబడింది. యమన్ యొక్క అబిసీనియా రాజప్రతినిధి (Abyssinias' Viceroy of Yaman) అబ్రాహా (Abraha), క్రైస్తవమతస్థుడు. అతడు 570 క్రీస్తుశకంలో మక్కాలోని క'అబహ్‌ను పడగొట్టే ఉద్దేశ్యంతో పెద్ద సైన్యంతీసుకొని, ఒక ఏనుగుపై ఎక్కివస్తాడు. మక్కా కొంత దూరంలోఉందనగా అతని ఏనుగు మక్కా వైపు పోకుండా ఆగి పోతుంది. ఆ తరువాత ఒక పక్షుల దండు వచ్చి, చిన్నచిన్న మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను వారిపై కురిపిస్తుంది. దానితో చాలా మంది సైనికులు మరణిస్తారు. సైన్యమంతా చెల్లాచెదరై పోతుంది. అబ్రాహా వెనుదిరిగి పోతూ మధ్య మార్గంలోనే మరణిస్తాడు. ఆ కాలంలో అబ్దుల్ ముత్తలిబ్ దైవప్రవక్త ('స'అస) తాత, మక్కా ఖురైషుల నాయకులుగా ఉంటారు. అదే సంవత్సరంలో దైవప్రవక్త ('స'అస) జన్మిస్తారు. ఇది మొదటి మక్కా కాలపు సూరహ్. ఇందులో **5 ఆయతులు** ఉన్నాయి.

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

1. ఏమీ? ఏనుగు వారి (సైన్యంతో) నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా?

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحَابِ الْفِيلِ ﴿١﴾

2. ఏమీ? ఆయన వారి కుట్రను భంగం చేయలేదా?[2]

أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِي تَضْلِيلٍ ﴿٢﴾

3. మరియు ఆయన వారిపైకి పక్షుల గుంపులను పంపాడు;

وَأَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا أَبَابِيلَ ﴿٣﴾

4. అవి (ఆ పక్షులు) వారి మీద మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను (సిజ్జీల్) విసిరాయి;[3]

تَرْمِيهِم بِحِجَارَةٍ مِّن سِجِّيلٍ ﴿٤﴾

---

1. ముఅ్'సదతున్: క్రమ్ముకొను. ఆ నరకపు ద్వారాలు మూయబడి ఉంటాయి. ఎవ్వరూ దాని నుండి బయటపడలేరు.
2. అంటే క'అబహ్‌ను పడగొట్టాలనే వారి కుట్రను భంగం చేయలేదా? అని.
3. చూడండి, 11:82.

فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُولٍ ۝٥

5. ఆ విధంగా ఆయన వారిని (పశువులు) తినివేసిన పొట్టుగా మార్చివేశాడు.

سُورَةُ قُرَيْشٍ

## 106. సూరహ్ ఖురైష్

ఖురైష్: మక్కాలోని ఒక పెద్ద తెగ పేరు. దైవప్రవక్త ('స'అస) ఈ తెగకే చెందినవారు. ఈ సూరహ్ మరొక పేరు సూరహ్ **అల్-ఈలాఫ్**. ఇది మొదటి మక్కా కాలపు సూరహ్. దీని పేరు మొదటి **ఆయత్**నుండి తీసుకోబడింది. సూరహ్ అల్-ఫీల్ మరియు సూరహ్ ఖురైష్ ఒకే సూరహ్ అని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇందులో **4 ఆయతులు** ఉన్నాయి.

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

**అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో**

لِإِيلَافِ قُرَيْشٍ ۝١

1. (అల్లాహ్ రక్షణ మరియు ఆయన కరుణతో) ఖురైషులు (ప్రయాణాలకు) అలవాటు పడ్డారు.

إِيلَافِهِمْ رِحْلَةَ الشِّتَاءِ وَالصَّيْفِ ۝٢

2. (అల్లాహ్ కరుణ మరియు ఆయన రక్షణతో) వారు శీతకాలపు మరియు వేసవికాలపు ప్రయాణాలు చేయగలుగుతున్నారు.[1]

فَلْيَعْبُدُوا رَبَّ هَٰذَا الْبَيْتِ ۝٣

3. కావున వారు ఈ ఆలయ (క'అబహ్) ప్రభువు (అల్లాహ్)ను మాత్రమే ఆరాధించాలి![2]

الَّذِي أَطْعَمَهُم مِّن جُوعٍ وَآمَنَهُم مِّنْ خَوْفٍ ۝٤

4. వారు ఆకలితో ఉన్నప్పుడు ఆయనే వారికి ఆహారం ఇచ్చాడు మరియు ఆయనే వారిని భయం (ప్రమాదం) నుండి కాపాడాడు.[3]

---

1. ఈలాఫున్: అలవాటుపడటం. ఖురైషుల ముఖ్య వృత్తి వ్యాపారం. వారు సీతాకాలంలో యమన్‌కు మరియు వేసవి కాలంలో సిరియాకు వ్యాపారానికి పోయేవారు. వారు క'అబహ్ నిర్వాహకులు కావటంవల్ల వారి వాణిజ్య బృందాలు ఎలాంటి ఆటంకం, ఆపాయం లేకుండా ప్రయాణం చేయగలిగేవి.

2. చూడండి, 2:125. అంటే ఒకే ఒక్క ఆరాధ్యుడు అయిన అల్లాహ్ (సు.తా.) వారిని సురక్షితంగా వ్యాపారం చేయనిచ్చినందుకు వారు ఆయన (సు.తా.) ను మాత్రమే ఆరాధించాలి, బహుదైవారాధనను త్యజించాలి.

3. వారిని ప్రమాదం నుండి కాపాడేవాడు మరియు వారిని పోషించేవాడు కేవలం అల్లాహ్ (సు.తా.) మాత్రమే కానీ - వారు పూజించే నిస్సహాయులైన - విగ్రహాలు గానీ, ఇతర కల్పిత దైవాలు గానీ కావు. కనుక వారు వాటి ఆరాధనను మానుకోవాలి. ఇంకా చూడండి, 2:126.